

15 నుంచి 23 వరకు కరగ మహోత్సవం

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత బెంగళూరు కరగ ఉత్సవం ఏప్రిల్ 15 నుంచి 23 వరకు జరగనుంది. బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఈ మేరకు ఉన్నతాధికారులతో రెండు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ధర్మరాయస్వామి దేవస్థానంలో ఏప్రిల్ 15న కరగ ఉత్సవానికి అంకురార్పణ జరగనుంది. ఈసారి కరగ మహోత్సవానికి కనీసం రూ.కోటిన్నర ఖర్చుకాగలదని అంచనా వేస్తున్నట్లు ధర్మరాయస్వామి దేవస్థానం అధ్యక్షు డు కె.సతీష్ తెలిపారు. బీబీఎంపీ ఈ ఉత్సవాల కోసం బడ్జెట్‌లో రూ. కోటి కేటాయించిందన్నారు. కరగ ప్రధాన ఉత్సవం ఏప్రిల్ 23న జరగనుందన్నారు.

లోకాయుక్త మెరుపు దాడులు



లోకాయుక్త కార్యాలయం

12 మంది అధికారుల నివాసాల్లో 60 చోట్ల తనిఖీలు
భారీగా ఆస్తుల రికార్డులు, బంగారం స్వాధీనం
కొనసాగుతున్న లెక్కింపు



బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి వందలరెట్లు అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో బుధవారం 12 మంది అధికారుల ఇళ్లు, కార్యాలయాలపై లోకాయుక్త మెరుపుదాడులు నిర్వహించింది. రాష్ట్ర వ్యాప్తంగా 60 చోట్లకుపైగా ఏకకాలంలో 13 మంది ఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 25 మంది సీఐలు సహా 130 మంది సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారు. బెంగళూరు మహానగర పాలికె చీఫ్ ఇంజనీర్ రంగనాథ్ ఇంటిపైనా, బ్యాటరాయపుర-యలహంక ప్రాంతీయ అధికారి రంగనాథ్‌కు చెందిన ఐదు స్థలాల్లో దాడులు నిర్వహించారు. అధికారులకు చెందిన అత్యాధునిక లగ్జరీ ఫ్లాట్లు, కార్యాలయాలపై దాడులు కొనసాగాయి. అదే విధంగా అబ్కారీశాఖ డిప్యూటీ కమిషనర్ రూపకు చెందిన ఉడుపిలో 5 ప్రాంతాల్లోనూ, జూనియర్ ఇంజనీర్ ప్రకాశ్‌కు చెందిన ఉత్తరకన్నడ జిల్లా కారవారలో 4 ప్రాంతాల్లోనూ, అసిస్టెంట్ ఇంజనీర్ ఫయాజ్ అహ్మద్‌కు సంబంధించి మైసూరులోని 12 ప్రాంతాల్లో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జయణ్ణకు చెందిన కొడగ, అటవీ అధికారి మహేశ్‌చంద్రయ్య హిరేమఠ్‌కు చెందిన ధారవాడలోని 6 ప్రాంతాల్లోనూ దాడులు సాగాయి. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీదర్‌కు చెందిన 4 ప్రాంతాల్లో, అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజప్పకు చెందిన కోలారులోని 5 చోట్ల, జమఖండి ఏఆర్‌టీఓ షణ్ముగప్పకు చెందిన బాగల్కోటెలోని నాలుగు చోట్ల, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సదాశివయ్యకు చెందిన చిక్కబళ్లాపురలో 6 చోట్ల దాడులు నిర్వహించారు. అలాగే సెకండ్ గ్రేడ్ అసిస్టెంట్ కృష్ణేగౌడ, అగసనపుర గ్రామపంచాయతీ మళవల్లి మండ్యలో నాలుగు చోట్ల, సదాశివ జయప్పకు చెందిన నిడగుంది కార్యాలయంపైనా దాడులు సాగాయి. భారీ ప్రమాణంలో రికార్డులు లభించాయని, బంగారు ఆభరణాలు, ఇతర ఆస్తుల విలువ లెక్కిస్తున్నట్లు లోకాయుక్త అధికారులు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల వేళ అకస్మికంగా లోకాయుక్త దాడులు నిర్వహించడం సర్వత్రా చర్చనీయాంశమైంది.


ఓ అధికారి నివాసం వద్ద లోకాయుక్త అధికారులు

నేటి నుంచి నామినేషన్ల పర్వం

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌తో ఊపందుకోనున్న రాజకీయం






బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 14 లోక్‌సభ నియోజకవర్గాలకు తొలి విడతలో ఏప్రిల్ 26న జరగనున్న పోలింగ్‌కు సంబంధించి గురువారం నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉడుపి-చిక్కమగళూరు, హాసన్, దక్షిణకన్నడ, చిత్రదుర్గ, తుమకూరు, మండ్య, మైసూరు, చామరాజనగర, బెంగళూరు గ్రామీణ, బెంగళూరు ఉత్తర, బెంగళూరు సెంట్రల్, బెంగళూరు దక్షిణ, చిక్కబళ్లాపుర, కోలారు నియోజకవర్గాలకు సంబంధించి నామినేషన్లను గురువారం నుంచే స్వీకరించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3వరకు నిబంధనలకు అనుగుణంగా నామినేషన్లను సమర్పించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంది. నామినేషన్లను దాఖలు చేసేందుకు ఏప్రిల్ 4 చివరి తేదీగా ఉంటుంది. మరుసటి రోజు వీటిని పరిశీలిస్తారు. ఉపసంహరణకు ఏప్రిల్ 8వరకు గడువు ఉంటుంది. పోలింగ్ ఏప్రిల్ 26న జరగనుండగా ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది.

నేడు నామినేషన్ దాఖలు చేయనున్న డీకే సురేశ్

బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్ గురువారం ఉదయం 11గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆయన స్వయంగా ఈ విషయాన్ని బుధవారం మీడియా సమావేశంలో ప్రకటించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తోపాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి రామలింగారెడ్డి, హోంశాఖ మంత్రి పరమేశ్వర్ పాల్గొంటారన్నారు. తాను ఐదేళ్లుగా ప్రజలమధ్యే ఉన్నానని, మరోసారి తనను భారీ మెజారిటీతో గెలిపిస్తారన్న నమ్మకం ఉందన్నారు.

విద్యుత్ కోతలు ఉండవు

● మంత్రి కేజే జార్జ్ భరోసా



విద్యుత్ శాఖ మంత్రి కేజే జార్జ్

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు ఉండవని, ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రజలకు విద్యుత్ సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి కేజే జార్జ్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా అధికారులకు ప్రత్యేక సూచనలు చేశామని తెలిపారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరగడం సహజమని, ఈసారి వేసవికి ముందే ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఇందుకు సన్నద్ధమైందని ఆయన పేర్కొన్నారు. లోడ్ షెడ్డింగ్‌కు తావులేని విధంగా వ్యవహరించాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గత ఏడాది ప్రతిరోజూ 300 మిలియన్ యూనిట్లుగా ఉంటే ప్రస్తుత ఏడాది ఇది 329 మిలియన్ యూనిట్లకు చేరిందన్నారు. గత ఏడాది గరిష్ఠంగా లోడ్ 15,300 మెగావాట్లు కాగా ప్రస్తుత ఏడాది ఇది 17వేల మెగావాట్లకు చేరుకుందన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు 7 గంటల విద్యుత్ సరఫరా పక్కాగా ఇస్తున్నామన్నారు. విద్యుత్ కొరతను అధిగమించే దిశలో థర్మల్ పవర్ స్టేషన్లలో గరిష్ఠంగా ఉత్పత్తి జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలోని మొత్తం విద్యుత్ అవసరాల్లో థర్మల్ పవర్ స్టేషన్లు కీలక పాత్ర ను పోషిస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన థర్మల్ పవర్ స్టేషన్లలో గరిష్ఠంగా 22 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పాదన జరిగిందని, ప్రస్తుతం ఉత్పాదన గరిష్ఠంగా రోజుకు 75 మిలియన్ యూనిట్లుగా ఉందన్నారు. వర్షాభావ పరిస్థితి కారణంగా రిజర్వాయర్లలో నీరు సగానికి పైగా తగ్గిపోవడంతో జల విద్యుత్ ఉత్పాదన దెబ్బతినకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని మంత్రి వివరించారు. కాగా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలతో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. 370 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యలహంక గ్యాస్ ఉత్పాదనా స్థావరం త్వరలోనే పనిచేయడం ప్రారంభించనుందని మంత్రి తెలిపారు.



మండ్యపై కుమార దృష్టి

పోటీకి సన్నద్ధం
బీజేపీ నేత కేసీ నారాయణ గౌడకు బుజ్జగింపు


కుమారను ఆహ్వానిస్తున్న నారాయణగౌడ తదితరులు

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మండ్య నుంచి బీజేపీ-జేడీఎస్ మిత్రకూటమి అభ్యర్థిగా బరిలోకి దిగాలనుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి తన గెలుపు కోసం వ్యూహాలకు పదును పెడుతున్నారు. గతంలో సంచలనాత్మక వ్యాఖ్యలు చేసి జేడీఎస్‌తో బంధాలు తెంపేసుకుని బీజేపీలో చేరిన మాజీ మంత్రి డాక్టర్ కేసీ నారాయణగౌడ నివాసానికి బుధవారం కుమారస్వామి అకస్మాత్తుగా వెళ్లి అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. మండ్య టిక్కెట్ బీజేపీకి దక్కాలంటూ కొద్దిరోజులుగా గట్టిపట్టుతో ఉన్న నారాయణగౌడను ఈ సందర్భంగా కుమారస్వామి భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ చొరవతోనే ఉభయనేతల భేటీ సాధ్యమైనట్లు తెలుస్తోంది. కాగా సుమలత అంబరీశ్‌కు టిక్కెట్ ఇవ్వాల్సిందేనంటూ గట్టిపట్టు పట్టిన నారాయణగౌడ ఈ భేటీ అనంతరం ఒకింత శాంతించినట్లు సమాచారం. బీజేపీ నేత సీపీ యోగేశ్వర్ కుమార్తె కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందని వినిపిస్తున్న తరుణంలో కుమారస్వామి ప్రత్యేకంగా యోగేశ్వర్‌ను కూడా భేటీ కాదలిచారు. పలు కారణాలతో గతంలో పార్టీ వీడిన నేతలను బుజ్జగించి తన విజయానికి సహకరించేలా కుమారస్వామి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. స్వయంగా మాజీ ప్రధాని దేవెగౌడ కూడా రెండు రోజుల్లో మండ్యకు వెళ్లి అక్కడే కొద్దిరోజులు గడపాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మొత్తానికి కుమారస్వామి రాకతో మండ్య రాజకీయ ముఖచిత్రం మారిపోయిందని కాంగ్రెస్‌కు గెలుపు అంత సులభం కాదని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

యువరాజును ఢీ కొంటున్న సామాన్యుడు





యదువీర్ రాకతో మారిన మైసూరు ముఖచిత్రం


బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మైసూరు రాజకుటుంబానికి చెందిన యదువీర్‌ను బీజేపీ అనూహ్యంగా రంగంలోకి దించడం ద్వారా మైసూరు - కొడగు నియోజకవర్గం ముఖచిత్రాన్నే పూర్తిగా మార్చేసింది. కాంగ్రెస్ పార్టీ తన సామాన్య కార్యకర్త లక్ష్మణను యదువీర్‌పై పోటీకి నిలిపింది. ఈ నియోజకవర్గం నుంచి 2014, 2019 ఎన్నికల్లో వరుస విజయాలు నమోదు చేసిన మాజీ పాత్రికేయుడు ప్రతాప్‌సింహను ఈసారి బీజేపీ పక్కన పెట్టింది. రెండు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉన్న ఒక్కలిగ నేత లక్ష్మణ్‌ను కాంగ్రెస్ వ్యూహాత్మకంగానే రంగంలోకి దించిందని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు ఈ నియోజకవర్గంలో గెలుపు అగ్నిపరీక్షగా మారింది. రాజకుటుంబీకులపై సహజంగా ప్రజల్లో ఉన్న గౌరవం, మోదీ గాలుల ప్రభావం తమ విజయానికి సోపానం కావడం ఖాయమని బీజేపీ వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి.

కాంగ్రెస్‌కే అత్యధిక మంది ఎమ్మెల్యేలు

ఈ నియోజకవర్గంలో మొత్తం 8 మంది ఎమ్మెల్యేలు ఉండగా అందులో ఐదుగురు కాంగ్రెస్ పార్టీకి, ఇద్దరు జేడీఎస్‌కు, ఒకరు బీజేపీకి చెందిన వారు. ఎమ్మెల్యేల బలం కూడా తమకు బాగా కలిసి వస్తుందని కాంగ్రెస్ నేతలు ఆశాభావంతో ఉన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలను ఒకసారి పరిశీలిస్తే బీజేపీ అభ్యర్థి ప్రతాప్‌సింహాకు 6,88,974 ఓట్లు రాగా, అప్పటి కాంగ్రెస్-జేడీఎస్ మిత్రకూటమి అభ్యర్థి సీహెచ్ విజయశంకర్‌కు 5,50,327 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో మొత్తం 20,72,337 మంది ఓటర్లు ఉండగా అందులో 10,17,120 మంది పురుష ఓటర్లు, 10,55,035 మంది మహిళా ఓటర్లు, 182 మంది హిజ్రా ఓటర్లు ఉన్నారు.



కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న బీజేపీ, జేడీఎస్ నేతలు




నేతలకు స్వాగతం పలుకుతున్న సీఎం

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మైసూరులో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార మాజీ అధ్యక్షుడు, బీజేపీ నేత హెచ్‌వీ రాజీవ్ ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమక్షంలో పెద్ద సంఖ్యలో తన మద్దతుదారులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో మైసూరు మాజీ మేయర్ భైరప్ప, కేఆర్ నగర జేడీఎస్ నేత కేవీ మల్లేష్ తదితరులు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని ఈ నేతలు ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు.

కేంద్రమంత్రి నారాయణస్వామికి మొండిచేయి

చిత్రదుర్గ బీజేపీ అభ్యర్థిగా గోవింద కారజోళ


నారాయణస్వామి


గోవింద కారజోళ

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే తన చివరి అభ్యర్థి పేరును కూడా బీజేపీ బుధవారం ప్రకటించింది. చిత్రదుర్గ రిజర్వుడు నియోజకవర్గానికి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి ఎ.నారాయణస్వామికి మొండిచేయి చూపారు. ఎస్సీలకు రిజర్వు చేసిన ఈ నియోజకవర్గానికి బీజేపీ తన అభ్యర్థిగా మాజీ ఉపముఖ్యమంత్రి గోవిందకారజోళ పేరును ప్రకటించింది. నారాయణస్వామిపై స్థానికంగా కొంత వ్యతిరేకత రావడం వల్లే ఆయనకు టిక్కెట్ కేటాయించలేకపోయినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. భవిష్యత్తులో ఇతరత్రా అవకాశాలు కల్పిస్తామని, గోవింద కారజోళను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని నారాయణస్వామికి అధిష్టానం పెద్దలు సూచించినట్టు తెలుస్తోంది. చిత్రదుర్గ బీజేపీ అభ్యర్థిగా గోవింద కారజోళ పేరు ప్రకటిస్తూనే మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప ఫోన్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సమ్మోహన రూపం

మోహినిగా దర్శనమిచ్చిన ఖాద్రీశుడు


శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, మార్చి 27: కుచ్చులు పెట్టిన వాల్జెడ, గుబాళించే మల్లెలు, యతికైనా మతిపోగొట్టే సోయగంతో, చంకన అమృతకలశాన్ని పెట్టుకుని మోహినీ అలంకరణలో శ్రీసత్యసాయి జిల్లా కదిరి నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఆ సమ్మోహనమూర్తిని దర్శించుకోవడానికి వేలాది భక్తులు తరలిరాగా ఆలయ ప్రాంగణం, తిరువీధులు సందడిగా మారాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నరసింహస్వామి మోహినీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం యాగశాలలో నిత్యపూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యా సమయంలో మోహినీ అలంకారం చేశారు. బ్రహ్మోత్సవాల్లో అన్ని రోజుల్లోనూ శ్రీవారు తిరువీధుల్లో మాత్రమే విహరిస్తారు. మోహినీ ఉత్సవం రోజు కోరిన భక్తుడి ఇంటికి వెళ్లి దర్శనమిస్తారు. బుధవారం రాత్రి ఆలయం నుండి బయలుదేరిన శ్రీవారు తిరిగి ఆలయానికి వచ్చేది గురువారం మధ్యాహ్నానికే. ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఉభయదారులు కోటా వెంకట్రామయ్య గుప్తా, లీలావతమ్మ, జయప్రకాష్, నారాయణ గుప్తా, సుజాత కుటుంబీకులతో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.


మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న నారసింహుడు


శ్రీవారికి అలంకరించిన కుచ్చుల వాలుజెడ


పోటెత్తిన భక్తులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,581.32	1,589.20
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	388
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	911	8,587
సామర్థ్యం (టీఎంసీలు)	5.15	10.38

భారీగా అక్రమ మద్యం స్వాధీనం



ఓ ఇంటిలో లభించిన అక్రమ మద్యం బాక్సులు

బళ్లారి సిటీ, మార్చి 27: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున అక్రమ మద్యం రవాణాకు సంబంధించి బుధవారం జిల్లాలో మూడు కేసులు నమోదయ్యాయని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్.మంజునాథ్ తెలిపారు. కురుగోడు తాలూకా బదనహట్టి గ్రామంలో ఓ ఇంట్లో సోదాలు నిర్వహించి అక్రమంగా నిలువచేసిన 20.160 లీటర్ల మద్యాన్ని స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. బళ్లారి నగరంలోని బండిహట్టి రోడ్డులో ద్విచక్ర వాహనంలో 8,820లీటర్ల (అంచనా విలువ రూ.43920) మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామన్నారు. బళ్లారి తాలూకా మించేరి గ్రామం వద్ద ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో అక్రమంగా తరలిస్తున్న 32.940 లీటర్ల మద్యాన్ని తరలిస్తుండగా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

శ్రీగంధం స్మగ్లింగ్ కేసులో నలుగురి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న శ్రీ గంధపు చెక్కలు

బళ్లారి సిటీ, మార్చి 27: సండూరు నుంచి బళ్లారికి అక్రమంగా గంధం చెక్కలను తరలించిన కేసులో నలుగురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. అరెస్టయిన వారిలో సండూరు తాలూకా సుశీలా నగర్‌కు చెందిన ఎల్.గంగా. నాయక్(41), కొట్టూరు తాలూకా హరకనహాలు గ్రామానికి చెందిన మహంతేశ్(24), హునగుంద తాలూకా కందగల్లు గ్రామానికి చెందిన చిన్నప్ప(49), రామన్న(61)లు ఉన్నారు. పోలీసుల తనిఖీల్లో నిందితులు ఏటీయోస్ కారు, టాటా పికప్ వాహనాలను అక్కడిక్కడే వదిలి పారిపోయారు. వాహనాల్లో 11ప్లాస్టిక్ సంచుల్లో 203 కిలోల బరువున్న చందనం చెక్కలను స్వాధీనంచేసుకున్నారు. వీటి విలువ రూ.30.45 లక్షలుగా, వాహనాల విలువ రూ. 7లక్షలుగా అంచనా వేశారు. పారిపోయిన నిందితుల ఆచూకీ కోసం పట్టణ పోలీసు ఇన్‌స్పెక్టర్ లఖన్ మసగుప్పి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేసిన పోలీసులను ఆయన అభినందించారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

సిరుగుప్ప, మార్చి 27 : జిల్లా కార్యాలయం నుంచి వచ్చిన ఈవీఎం బాక్స్‌లను వివేకానంద పబ్లిక్ పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచినట్లు కొప్పాళ లోక్‌సభ ఎన్నికల అధికారి డాక్టర్ తిరుమలేష్ తెలిపారు. సిరుగుప్ప నియోజకవర్గంలో 228 పోలింగ్ బూత్‌లు వున్న నేపథ్యంలో ఆయన స్ట్రాంగ్ రూమ్‌ను బుధవారం పరిశీలించారు. అభ్యర్థుల నామినేషన్ల అనంతరం ఈవీఎంలలో క్యాండెట్ పేర్లను నమోదు చేస్తామని తెలిపారు. తహసీల్దార్ షంషాలం, ఈవో పవన్‌కుమార్ దండప్ప, కాంగ్రెస్, జేడీఎస్, బీజేపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరుగుదలకు కృషి

ఓటింగ్ శాతం పెరుగుదలకు అధికారులు కృషి చేయాలని జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప సుంకనూరు తెలిపారు. సిరుగుప్ప పట్టణంలో బుధవారం శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరుగుదలపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో తాగునీటి వ్యవస్థ, విద్యుత్ సౌలభ్యం, వికలాంగులకు ర్యాంప్ ఏర్పాటు సదుపాయాలను కల్పించాలని పోలింగ్ బూత్ అధికారులకు తెలిపారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రాహుల్ శరణప్ప

సి-విజిల్‌తో అక్రమాలకు బ్రేక్

ఎలక్షన్ కమిషన్ కొత్త ప్రయోగం

- గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో
- సామాన్య ప్రజలనూ భాగస్వామ్యం చేసేందుకే..
- ఆడియో, వీడియో, ఫొటోల ద్వారా ఫిర్యాదు చేసే వెసులుబాటు
- వంద నిమిషాల్లో చర్యలు

బళ్లారి సిటీ

ఎలాంటి అక్రమాలు జరగకుండా సార్వత్రిక ఎన్నికలను సాఫీగా నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట చర్యలను చేపడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అవసరమయ్యే అన్ని రకాల వనరులను ఈసీ వాడుకుంటోంది. అందులో భాగంగానే తీసుకొచ్చిన సి-విజిల్ యాప్ ద్వారా సామాన్య ప్రజలను కూడా భాగస్వామ్యం చేసింది. ఎన్నికల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన నాయకుల పని పట్టేందుకు దీనిని పాశుపతాస్త్రంగా ఉపయోగించుకోవచ్చు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దిశ, నిర్దేశం చేసే సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తన నియమావలి(మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)అమలులోకి వచ్చేసింది. ప్రస్తుతం ఉమ్మడిజిల్లాలో ఈ ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా మారాయి. అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎలాగైనా గెలవాలని దురుద్దేశ్యంతో అధికారాన్ని అడ్డం పెట్టుకుని రెచ్చిపోయే అవకాశాలు లేకపోలేదు. ఎన్నికల నిబంధనలను సైతం తుంగలో తొక్కేవాళ్లులేకపోలేదు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా వలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ కన్ను సన్నల్లో పనిచేసేందుకు సిద్ధమవుతోంది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటుచేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వామ్యం చేసింది. సీ విజిల్ యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. నిబంధనలు ఉల్లంఘించేవారిని పట్టించేందుకు సీ విజిల్ ఎంతగానో దోహదం చేయనుంది.



సి విజిల్ అంటే ఏమిటి?

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన నాటి నుంచి ఈ సీ విజిల్ యాప్ అందుబాటులోకి వచ్చింది. ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా అందులో పొందుపరచవచ్చు. ఫోటో లేదా వీడియోలేదా ఆడియో రూపంలో రికార్డు చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటారు. దీన్ని ప్రజలు ఎవరైనా వినియోగించుకోవచ్చు. పార్టీలకు అతీతంగా ఎవరు అవినీతికి పాల్పడినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

ఐదు నిమిషాల్లో రంగంలోకి...

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దాన్ని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిక ఇస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఈ యాప్‌లో ఉంది.

రిజిస్ట్రేషన్ చేసుకోవడమెలా?

సెల్‌ఫోన్‌లోని గూగుల్ ప్లేస్టోర్‌లో కేంద్ర ఎన్నికల సంఘానికి సంబంధించిన సి-విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్ నెంబరు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసుకుంటే సీ విజిల యాప్ సిద్ధమైనట్లే. దీని ద్వారా ప్రజలు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.

ఎలా ఫిర్యాదు చేయాలి?

యాప్ ఓపెన్ కాగానే స్క్రీన్‌పై ఫోటో, వీడియో, ఆడియో ఇలా మూడు ఆప్షన్లు ఉంటాయి. ఫోటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫోటో ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. మీ లోకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫోటోను అప్‌లోడ్ చేయాలి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఎన్నికల సంఘానికి చేరుతుంది. యాప్‌లో వివరాలు పొందుపరచగానే సంబంధిత విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని జిల్లా సీ-విజిల్ నోడల్ అధికారిణి సకీనా తెలిపారు

కాలువపైన షాపులు తొలగించండి

కంప్లి, మార్చి 27 : కుడితిని పట్టణంలో రాజు కాలువపైన ఎలాంటి అనుమతులు లేకుండా, పనులు పూర్తి కాకముందే ఏర్పాటు చేసుకున్న షాపులను పట్టణ పంచాయతీ అధికారులు తొలగించాలని పట్టణ ప్రముఖులు బసవరాజు కోరారు. పట్టణం ఎన్నోయేళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోయిందని, గత కొంతకాలంగా డీఎంఎఫ్ నిధులతో పట్టణం అభివృద్ధి చెందుతున్న దశలో కొందరు షాపులు ఏర్పాటు చేసుకోవడంతో పనులకు ఆటంకం కలుగుతోందన్నారు.. చేసిన పనులకు క్యూరింగ్ చేయకముందే షాపులు ఏర్పాటుచేసుకుంటున్నారని, ఇలా చేయడం వలన పనులకు ఆటంకం కలుగుతుందన్నారు.

తోడేళ్ల దాడిలో 31 గొర్రెపిల్లల మృతి



మృతిచెందిన గొర్రె పిల్లలను పరిశీలిస్తున్న అధికారులు

కంప్లి, మార్చి 27 : సిరిగేరి పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరాపురం గ్రామం వద్ద బుధవారం మధ్యాహ్నం గొర్రె పిల్లల మందపై తోడేళ్లు దాడి చేయడంతో 31 గొర్రె పిల్లలు మృతి చెందాయి. సిరిగేరి గ్రామానికి చెందిన మౌలా గొర్రెపిల్లలతో మేత కోసం బైరాపురం గ్రామం వైపు వెళ్లాడు.. అక్కడ వీరన్న పొలంలో మధ్యాహ్న సమయంలో చెట్టు నీడన వున్న గొర్రెల మందపై తోడేళ్లు దాడి చేశాయి. ఈ దాడిలో 31 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయంపై సిరిగేరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి విస్తృత ప్రచారం



పీడీహళ్లిలో ప్రచారరథంపై నుంచి మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి శ్రీరాములు

బళ్లారిరూరల్, మార్చి 27 : బళ్లారి తాలుకా గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి శ్రీరాములు బుధవారం హలకుంది, బెళగల్, సంజీవరాయుని కోట, ఎత్తినబూదేహాళ్, శంకర బండ, రూపనగుడి, చేళగుర్కి, పీడీహళ్లి, సిడిగినమల గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోదీ తన గెలుపు తథ్యమని చెప్పారన్నారు. గతంలో లోక్‌సభ ఎంపీగా, ఎమ్మెల్యేగా గ్రామీణ క్షేత్రాలను ఎంతో అభివృద్ధిచేశానని తెలిపారు. గుత్తి నుంచి బెళగావికి నాలుగు లైన్ల రోడ్డు వేయించానన్నారు. ఈ సందర్భంగా పీడీహళ్లిలో అభిమానులు శ్రీరాములును గజమాలతో సత్కరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్సీ సతీష్, గుర్లింగనగౌడ, బీజేపీ జిల్లా అధ్యక్షులు మోకా అనిల్ నాయుడు, పీడీ హళ్లి వాల్మీకి సంఘ మాజీ జిల్లా అధ్యక్షులు జనార్దన్ నాయక్, మాజీ ఏపీఎంసీ అధ్యక్షులు ఉమేష్, పీడీ హళ్లి కౌకుంట్ల బసవరాజు, రూపనగుడి పంచాయతీ మాజీ అధ్యక్షులు హావళిగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తుకారామ్‌కు భారీ మెజార్టీ అందిస్తాం



తుకారామ్‌ను అభినందిస్తున్న గణేష్

కంప్లి, మార్చి 27 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బళ్లారి జిల్లాలో కంప్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తుకారామ్‌కు భారీ మెజార్టీ అందించి కాంగ్రెస్ విజయానికి నాంది పలుకుతామని కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. కురుగోడు దొడ్డ బసవేశ్వరస్వామిని బుధవారం ఎమ్మెల్యే తుకారామ్ దర్శించుకున్నారు. రథోత్సవం సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. అలాగే ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తన కార్యాలయంలో తుకారామ్‌ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, సండూరు నియోజకవర్గంలో నాలుగుసార్లు తానుచేసిన అభివృద్ధి వల్లే గెలుపొందానని, అలాగే కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి తరపున కూడా తానే బరిలో దిగుతున్నారని ఆయన గెలుపు ఖచ్చితమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరవే గ్రామీణ అధ్యక్షుడిగా పంపన్నగౌడ

బళ్లారిరూరల్, మార్చి 27 : బళ్లారి నగరంలో కర్ణాటక రక్షణ వేదిక కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చానల్ శేఖర్, జిల్లా అధ్యక్షులు అంగడి శంకర్ పంపన్నగౌడకు నియామకపత్రం ఇచ్చి గ్రామీణ ప్రాంతాల్లో రక్షణ వేదిక అధ్యక్షునిగా సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా కర్ణాటక రక్షణవేదిక గ్రామీణ అధ్యక్షులుగా ఎన్నికైన పంపన్నగౌడను అభినందించారు. ఈ కార్యక్రమంలో పదాధికారులు తిమ్మారెడ్డి, చంద్రమోహన్, శివకుమార్, కలకంబ్ల పంపాపతి, అంద్యాల్ పురుషోత్తమ్, ఒణిగనూరు చాంద్ బాషా, ఆటో అంజి, గోనాల్ రఘు, కుమార్, నీలకంఠ, గోటూరు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పంపన్న గౌడకు, రాష్ట్ర ఉపాధ్యక్షులు చానల్‌శేఖర్‌కు సన్మానం చేస్తున్న పదాధికారులు

క్షయవ్యాధి పట్ల భయం వీడండి: డీహెచ్‌ఓ

వ్యాధి నుంచి కోలుకున్న వారికి సన్మానం

బళ్లారి సిటీ, మార్చి 27: మైకోబాక్టీరియం ట్యూబర్‌క్యులోసిస్ వల్ల వచ్చే క్షయవ్యాధిని ఆరు నెలల చికిత్సతో నయం చేయవచ్చునని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు తెలిపారు. ఇందువలన ఎటువంటి భయం ఉండదని, అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం కింద బుధవారం నగరంలోని బండిహట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయవ్యాధికి సరైన వైద్యం పొందిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రకారం క్షయవ్యాధికి చికిత్స పొందుతున్న వారికి జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ ద్వారా పౌష్టికాహార కిట్‌లు అందించామన్నారు. టీబీ బాధితులు తప్పనిసరిగా పౌష్టికాహారంతో పాటు మాత్రలు రోజు వేసుకోవాలని సూచించారు. ఎవరికైనా రెండు వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు ఉంటే తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ అబ్దుల్లా మాట్లాడుతూ, క్షయవ్యాధిని అంతమొందించగలమనే నినాదంతో ఈ ఏడాది అవగాహన కల్పిస్తున్నామన్నారు. వ్యాధి నివారణకు ఇప్పటికే నగరంలో విమ్స్, జిల్లాఆసుపత్రుల్లో సిబినాట్ మిషన్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ట్రూనాట్ మిషన్ ఏర్పాటు చేశామన్నారు. ఈసందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డా.యాస్మీన్,డాక్టర్ నిజాముద్దీన్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దాసప్పనవర్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ పంపాపతి, జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ రాజేశ్‌పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రమేశ్‌బాబు

బళ్లారి మేయర్, ఉపమేయర్ ఎన్నిక వాయిదా

బళ్లారి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో గురువారం జరగాల్సిన మహనగర పాలికె మేయర్, ఉపమేయర్, నాలుగు స్థాయి సమితి సభ్యుల ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు కలబురిగి రీజనల్ ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ఈ మేరకు నోటీసులను కార్పొరేటర్లకు, అలాగే ఇందుకు సంబంధించిన ఓటు ఉన్న ప్రజాప్రతినిధులకు అందజేశారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఈ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. మేయర్ పదవికి కాంగ్రెస్‌కు చెందిన నలుగురు కార్పొరేటర్లు పోటీ పడుతున్నారు. ఇప్పుడు ఎన్నికలు జరిగి ఒకరు మేయర్‌గా ఎన్నికయితే మిగిలిన ముగ్గురు అలిగి లోక్‌సభ ఎన్నికలకు దూరం అవుతారని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులే మేయర్ ఎన్నిక వాయిదా వేయించి ఉంటారని పలువురు భావిస్తున్నారు.

రైతుల పురోభివృద్ధే మా లక్ష్యం



రైతులను అభినందిస్తున్న స్వరాజ్ ట్రాక్టర్ కర్ణాటక ప్రతినిధి రిషిరాజ్ భూమన్

బళ్లారి సిటీ, మార్చి 27: రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు వ్యవసాయానికి సహకరించేందుకు స్వరాజ్ కంపెనీ ఎన్నో అవకాశాలను కల్పించిందని ఆ కంపెనీ కర్ణాటక ప్రతినిధి రిషిరాజ్ భూమన్ పిలుపు నిచ్చారు. స్థానిక కల్యాణమంటపలో బుధవారం ఏర్పాటు చేసిన కంపెనీ సువర్ణ మహోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1952లో స్వరాజ్ ట్రాక్టర్ తయారీని రైతులే చేశారన్నారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 22లక్షల ట్రాక్టర్లను రైతులు కొనుగోలు చేశారని తెలిపారు. రైతులకు నమ్మకశ్యంగా సేవలందించి వారి పురోభివృద్ధికి సహకరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆదర్శరైతులను సన్మానించారు. తొలుత ట్రాక్టర్లతో ర్యాలీ చేపట్టారు. ఈకార్యక్రమంలో 30 ట్రాక్టర్లను రైతులకు అందజేశారు. ప్రతినిదులు, నితిన్ మలోజా, అమిత్‌వరుడె,గురురాజ్,మంజునాథ్, చిట్లూరి రాజేశ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో 600మందికిపైగా రైతులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వ్యక్తమయ్యేది రంగస్థలంపైనే

బళ్లారి సిటీ, మార్చి 27: వినోదం కోసం అనేక మాధ్యమాలు ఉన్నప్పటికీ, సృజనాత్మకతను వికసింపజేయడంలో రంగస్థలం ప్రముఖ పాత్ర పోషిస్తుందని మైసూరులోని కళల విశ్వవిద్యాలయం చాన్సలర్ ప్రొఫెసర్ నగేష్ బెట్టకోటె అన్నారు. నగరంలోని శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ ఆడిటోరియంలో 'రంగస్థల సమయాభావం ' అనే అంశంపై నిర్వహించిన ఒక రోజు ఇంటర్ డిసిప్లీనరీ నేషనల్ సింపోజియంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాటక విద్య బాగుంటే సమాజానికి నైతిక విద్యను అందించడంలో కళాకారులు దోహదపడుతారన్నారు. మంచి ప్రదర్శన, వివిధ భాషలు తమను తాము ప్రదర్శించుకోవడానికి అవకాశమిస్తాయన్నారు. ప్రదర్శన కళలను విశ్వవిద్యాలయంలో అంతర్భాగంగా తీర్చిదిద్దడంపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహారాష్ట్రలోని వైజనాథ్ సిర్సాల , నాటక విభాగాదిపతి డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలోని సమస్యల పరిష్కారానికి రంగస్థలం కూడా కృషి చేస్తుందన్నారు. ఈసందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రమేశ్ ఓలేకర్, నాటక విభాగం అతిథి అధ్యాపకులు సహనా పింజారా, హేమేశ్వర్ పాల్గొన్నారు.

హోసూరు జోన్

వందశాతం పోలింగ్‌కు కృషి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు

హోసూరు, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలంతా తమ ఓటుహక్కు వినియోగించుకోవడం ద్వారా వందశాతం పోలింగ్ లక్ష్యానికి సహకరించాలని వివిధశాఖల అధికారులు పేర్కొన్నారు. కావేరిపట్టణంలోని మల్లెతోటలో వ్యవసాయ శాఖ అధికారులు ఓటు హక్కుపై కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. సింగారపేట గ్రామం వదంకరై సర్కిల్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ గురించి అవగాహన కల్పించేలా చక్రాల ర్యాలీ ద్వారా ఓటర్లకు అవగాహన కల్పించారు. సహాయ ఎన్నికల అధికారి జిల్లా ఆది ద్రావిడ గిరిజన సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. కృష్ణగిరి వాకబ్ నగర్‌లో మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులతో కలసి జాగృతి నిర్వహించారు. కొన్ని చోట్ల గోరింటాకు వేసి అవగాహన కల్పించారు. ఊత్తంగరై ప్రాంతంలో వ్యవసాయ శాఖ అధికారులు కరపత్రాలు పంపిణీ చేసి ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. బర్గూరు బస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో చైతన్య కార్యక్రమాలను నిర్వహించారు.

కనులపండువగా తెప్పోత్సవం

హోసూరు, మార్చి 27: హోసూరులో మరగతాంబ సమేత చంద్రచూడేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. తేరుపేటలోని పుష్కరిణిలో బుధవారం రాత్రి జరిగిన తెప్పోత్సవంలో సుమారు 5వేలకుమందికిపైగా భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తమలపాకుపై కర్పూరం వెలిగించి పలువురు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉప్పు, మిరియాలు నీటిల్లో వేయడం, స్వామి వారికి దీపారాధన చేయడం, ఇలా భక్తులు తమకు తోచిన విధంగా మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే, ఆలయ కమిటీ చైర్మన్ మనోహరన్, కార్పొరేషన్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, బీజేపీ అధ్యక్షుడు నాగరాజ్, డీఎంకే కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. తెప్పోత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రబ్బరుబోట్లతో అగ్నిమాపక సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టారు. మరోవైపు పోలీసులు కూడా భారీ సంఖ్యలో బందోబస్తులో పాల్గొన్నారు.



తెప్పోత్సవంలో పాల్గొన్న భక్తులు

బీజేపీ టిక్కెట్ కేటాయింపుపై పునఃపరిశీలించాలి

రాయచూరు, మార్చి 27 : రాయచూరు లోకసభ స్థానం నుంచి బీజేపీ తరపున పోటీ చేసే అవకాశం కల్పిస్తానని స్వయంగా మాజీ ముఖ్యంత్రి బసవరాజ్ బొమ్మై, పార్టీ రాష్ట్రధ్యక్షుడు విజయేంద్రలు చెప్పినా అమలు చేయకపోవడాన్ని మాజీ ఎంపీ బీవీ నాయక్ తప్పుబట్టారు. ఇప్పటికే సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్‌కు టిక్కెట్ కేటాయిస్తు తీసుకున్న నిర్ణయాన్ని పున: పరిశీలించాలని కోరారు. లేదంటే రెండు రోజుల్లో తన అభిమానులు, మద్దతుదారులతో కలిసి సమావేశంలో నిర్ణయించి వారి కోరిక మేరకు తుది నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. బుధవారం నగరంలోని ఒక ప్రైవేటు హోటెల్‌లో మాజీ ఎంపీ బీవీ నాయక్ మద్దతుదారులు, శ్రేయోభిలాషులతో సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన గతంలో తాను టికెట్ కోరకున్నా రాష్ట్ర నాయకులే తనకు టికెట్ కేటాయింపుపై భరోసా ఇవ్వడమే గాక ప్రచారం చేసుకోమని కూడా సలహా ఇచ్చినట్లు వివరించారు. ఈ క్రమంలో తనకు టికెట్‌ను తప్పించడం మద్దతుదారులు, శ్రేయోభిలాషుల్లో తీవ్ర నిరాశను మిగిల్చిందన్నారు. సమావేశంలో మాట్లాడిన మరో నాయకుడు బసవన గౌడ బ్యాగవాట్, రెండు రోజుల్లో రాష్ట్ర నాయకత్వం సరైన నిర్ణయం తీసుకోకపోతే బీవీ నాయక్ రాజకీయంగా తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామన్నారు. అడగలేకపోయినా టికెట్ ఇస్తామని నమ్మించి మాట తప్పడం రాష్ట్ర నాయకులకు తగదన్నారు. ఈ విషయంలో బీవీ నాయక్‌కు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీవీ నాయక్

నవోదయను డీమ్డ్ వర్సిటీగా మార్చుతాం: చైర్మన్ ఎస్ఆర్ రెడ్డి

రాయచూరు, మార్చి 27 : విద్య, వైద్య రంగంలో గడచిన 32 ఏళ్లుగా విశిష్ట సేవలందిస్తున్న నవోదయ విద్యసంస్థను డీమ్డ్ యూనివర్సిటీగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎస్.ఆర్ రెడ్డి వెల్లడి తెలిపారు. బుధవారం నగరంలోని నవోదయ వైద్య కళాశాలలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ సంస్థకు సంబంధించిన పలు విషయాలను ఆయన వెల్లడించారు. 130 ఎకరాల విస్తీర్ణంలో మూడు క్యాంపస్‌లతో కూడిన నవోదయ విద్య సంస్థలో 2000 మందికి పైగా ఉద్యోగులు ఉండగా గడచిన మూడుదశాబ్దాలుగా అనేక విజయాలను రికార్డు చేసిందన్నారు. ప్రతి ఏటా దాదాపు 600 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యనభ్యశిస్తూ 95 శాతం ఉత్తీర్ణతను సాధిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన వివిధ పరీక్షల్లో 54 మంది విద్యార్థులు బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. క్రీడలకు సంబంధించి 39 మంది విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ట్రోఫీలు దక్కించుకున్నారన్నారు. త్వరలోనే తమ సంస్థలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్లు ఎస్ఆర్ రెడ్డి తెలిపారు. 149 పరిశోధనలను పూర్తి చేసి రిజిస్టర్ చేయించినట్లు తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

చిత్తూరు నాగయ్య (జయంతి)



దక్షిణాదిన 'పద్మశ్రీ' పురస్కారం పొందిన తొలి నటుడు నాగయ్య చిత్తూరు నాగయ్య 1904 మార్చి 28న గుంటూరు జిల్లా రేపల్లెలో జన్మించారు. ఆయన అసలు పేరు ఉప్పలదడియం నాగయ్య. నటుడిగానే కాక సంగీత కర్త, గాయకుడు, దర్శకుడు, నిర్మాతగా రాణించారు. ఆయన ధరించిన పోతన, త్యాగయ్య, వేమన, రామదాసు వంటి అనేకపాత్రలు బహుళ ప్రజాదరణ పొందాయి. 1938లో 'గృహలక్ష్మి' చిత్రంతో సినీరంగ ప్రస్థానం ప్రారంభమైంది. తెలుగు, తమిళ భాషలలో 336కుపైగా సినిమాల్లో నటించారు. మహారాజుల నుంచి విశ్వవిద్యాలయాల్లో, ప్రభుత్వంలో ఉన్నతాధికారులనుంచి విశేష గౌరవాలు లభించాయి. త్యాగయ్య సినిమా చూసి మైసూరు మహారాజు, నాగయ్యను 101 బంగారు ఆభరణాలు, కంఠాభరణంతో సత్కరించారు. 1978 డిసెంబరు 30న కన్నుమూశారు.

పుట్టపర్తి నారాయణాచార్యులు (జయంతి)



తెలుగు సాహితీకారులలో అగ్రగణ్యుడు, బహుభాషా కోవిదుడైన పుట్టపర్తి నారాయణాచార్యులు 1914 మార్చి 28న అనంతపురం జిల్లా చియ్యేడు గ్రామంలో జన్మించారు. తెలుగు పదాలతో 'శివతాండవం' ఆడించిన కవి. ఆ కావ్యం చదువుకున్నంతసేపూ గుక్క తిప్పుకోనీయదు, కనురెప్ప వాల్చనీయదు, కావ్యంలో అతను సాధించిన సౌందర్యం అనితరసాధ్యం, అందుకే ఆ కావ్యాన్ని ఆధునిక మహాకావ్యంగా అభివర్ణిస్తారు. 140కుపైగా గ్రంథాలు, 7వేలకు పైగా సంగీత స్వర కల్పన చేశారు. ఫ్రెంచ్, పర్షియన్ సహా 14భాషలలో పండితులు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత. 1990 సెప్టెంబరు 1న కన్ను మూశారు. ప్రొద్దటూరులో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు.

జిల్లెళ్లమూడి అమ్మ (జయంతి)



జిల్లెళ్ళమూడి అమ్మగా పేరొందిన మాతృశ్రీ అనసూయ దేవి 1923 మార్చి 28న గుంటూరు జిల్లాలో మన్నవ గ్రామంలో జన్మించారు. చిన్నతనం నుంచి అనేక మహిమలు కలిగి చాటారు. 'నేను అమ్మని మీరు నా బిడ్డలు' అనేవారు. అమ్మ వేదాంత సూత్రం 'ప్రపంచమంతా ఒక్కటే, ఒక్కడే దేవుడు'. ప్రజలకు ఆధ్యాత్మిక అంశాలపై ఉపదేశములు ఇచ్చేవారు. జిల్లెళ్ళమూడిలోని 'అనసూయేశ్వరాలయం' నిరంతరం అన్నదాన కార్యక్రమం జరిగే ఆలయం. 1978లో మాతృశ్రీ మెడికల్ సెంటర్, మాతృశ్రీ ఓరియంటల్ కాలేజ్, సంస్కృత పాఠశాలలను నిర్వహించారు. 1985 జూలై 12న నిర్యాణం చెందారు.

మున్ మున్ సేన్ (పుట్టినరోజు)



మున్ మున్ సేన్ 1954 మార్చి 28న కోల్కత్తాలో జన్మించారు. బెంగాలీ, హిందీ, తమిళ, తెలుగు, తమిళ, మలయాళ, మరాఠీ, కన్నడ భాషల సినిమాలలో నటించారు. బుల్లితెరపైనా 40కుపైగా సీరియల్స్‌లో నటించారు. 1987లో 'సిరివెన్నెల' చిత్రంలోని ఆమె నటనకు ఉత్తమ సహాయనటిగా నంది పురస్కారం అందుకున్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం బంకురా నియోజక వర్గం నుంచి ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ తరఫున లోక్‌సభ సభ్యురాలిగా 2014 నుంచి 2019 వరకు ప్రాతినిధ్యం వహించారు.

నాజర్ హుసేన్ (పుట్టినరోజు)



నాజర్ హుసేన్ 1968 మార్చి 28న జన్మించారు. బ్రిటీష్ క్రికెట్ కామెంటేటర్, మాజీ క్రికెటర్, ఇంగ్లండ్ క్రికెట్ జట్టుకు కేప్టెన్‌గా వ్యవహరించారు. 96 టెస్ట్ మ్యాచ్‌లు, 88 వన్డేలు ఆడారు. 650కుపైగా మ్యాచ్‌లలో 62 సెంచరీలతో కలిపి 30వేలకుపైగా పరుగులు సాధించారు. 2005లో ఆటో బయోగ్రఫీ 'ప్లేయింగ్ విత్ ఫైర్' రచనకు బ్రిటీష్ స్పోర్ట్స్ బుక్ అవార్డు అందుకున్నారు.

లేడి గాగా (పుట్టినరోజు)



లేడి గాగా పేరొందిన స్టెఫాని జొన్నె అంజెలినా గెర్మానొట్టా 1986 మార్చి 28న జన్మించారు. అమెరికా దేశంలో పేరొందిన గాయని, గేయ రచయిత, నటి. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్, 12 గ్రామీ అవార్డ్స్, సాంగ్ రైటర్స్ హాల్ ఆఫ్ ఫేమ్, కౌన్సిల్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనర్స్ ఆఫ్ అమెరికా తదితర అవార్డులు అందుకున్నారు. 'బార్న్ దిస్ వే ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి యువతలో ఆరోగ్యంపై చైతన్యం కల్పించారు.

ఘనంగా బాలాంజనేయస్వామి రథోత్సవం



పురవీధులలో రథోత్సవం

శ్రీనివాసపుర, మార్చి 27: పట్టణంలోని వరద బాలాంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద సంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. రథంపై అరటిపండ్లు, దవనం వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు. జాతరలో బొరుగులు, బత్తాసు, మిక్సర్ తదితర తినుబండారాలను ఉత్సాహంగా కొనుగోలు చేశారు. మంగళవారం రాత్రి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో వేణుగోపాలస్వామి కృపాపోషిత నాటక మండలి ఆధ్వర్యంలో 'రాజసూయ యాగ, ధర్మరాజు పట్టాభిషేకం తెలుగు పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. ఎటు చూసినా జాతర సందడినెలకొంది. ఉత్సవంలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు వహించారు.

వందశాతం ఓటింగ్‌పై జాగృతి

- స్వీప్ కమిటీల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు
- దివ్యాంగులతో వినూత్న జాగృతి



దివ్యాంగులతో బైక్‌ర్యాలీకి పచ్చజెండా



జాగృతిలో ఆశా కార్యకర్తలు తదితరులు



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విధానసౌధ వద్ద దివ్యాంగులతో బైక్ ర్యాలీకి పచ్చజెండా చూపడం ద్వారా వినూత్న జాగృతి నిర్వహించారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రజనీశ్ గోయెల్ ప్రారంభించారు. జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు దివ్యాంగుల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడినవారు, థర్డ్ జెండర్‌లు అందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. పోలింగ్‌బూత్‌ల వద్ద దివ్యాంగులకోసం ప్రత్యేక ర్యాంప్ వ్యవస్థ కల్పించామన్నారు. ఏప్రిల్ 26న పోలింగ్ జరగనుందని ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. విధానసౌధ మెట్ల నుంచి కేఆర్ సర్కిల్, నృపతుంగ రోడ్డు, హడ్సన్ సర్కిల్, కంఠీరవ స్టేడియం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్ మీనా, అదనపు ముఖ్య ఎన్నిల అధికారి కూర్మారావ్, స్వీప్ ఎన్నికల సమితి అధ్యక్షుడు కాంతరాజ్, బెంగళూరు జిల్లా స్వీప్ నోడల్ అధికారి ప్రతిభా తదితరులు పాల్గొన్నారు.

కైవారలో..

చింతామణి రూరల్, మార్చి 27: తాలూకాలోని పవిత్ర యాత్రాస్థలమైన కైవారలో చింతామణి తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కు వినియోగంపై జాగృతి నిర్వహించారు. తాలూకా పంచాయతీ ఈఓ ఎస్ ఆనంద్ మార్గదర్శకంలో తాలూకా పంచాయతీ నరేగా సహాయక డైరెక్టర్ కవితా, కైవార పీడీఓ కరి బసప్ప నేతృత్వంలో జాథా చేపట్టారు. ప్రజలచే ఓటు హక్కు పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కవితా మాట్లాడుతూ ప్రజాప్రభుత్వ వ్యవస్థలో అర్హులైనవారంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా తగిన అభ్యర్థిని ఎన్నుకోవాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని యువత, ప్రజలు తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా వందశాతం పోలింగ్‌కు సహకరించాలన్నారు. 18ఏళ్ల పైబడిన ఎపిక్ కార్డు పొందినవారంతా ఓటు వేయాలన్నారు. కాగా గత ఏడాది తక్కువగా పోలింగ్ నమోదైన బూత్‌ప్రాంతాలను గుర్తించి ప్రజలను చైతన్యం తెస్తున్నామన్నారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌లు ఓటు హక్కు కోసం అవసరమైన వాహన వ్యవస్థకు చర్యలు తీసుకుటున్నామన్నారు. 85ఏళ్ల పైబడినవారు ఇంటి వద్దనే ఓటు వేసేలా ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్‌లు సాధ్యమైన మేరకు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడం ద్వారా ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా కైవార గ్రామ పంచాయతీ పీడీఓ ఎంకే కరిబసప్ప, కార్యదర్శి కృష్ణప్ప, సిబ్బంది చన్నప్ప కెహెచ్, శంకరప్ప, వెంకటేశప్ప, ఆంజనప్ప, మళ్ళూరప్ప, రాజణ్ణ, గాయత్రి, చైత్రా, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లిపిగార్లపల్లి తండాలో ఓటుపై ప్రచారం

బాగేపల్లి, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో చేళూరు తాలూకాలోని ఎం నల్లగుట్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లిపిగారపల్లి తాండాలో బుధవారం 'మా ఓటు మా హక్కు' అనే నినాదంతో జాగృతి నిర్వహించారు. తాండా మహిళలతో కలసి నృత్యం చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ప్రజాప్రభుత్వ పండుగలో అందరూ పాల్గొంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పోలింగ్‌బూత్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవడం మన కర్తవ్యమన్నారు. ప్రత్యేకించి తాండా ప్రాంతాల్లో వందశాతం ఓటింగ్‌కు ప్రజలు సహరించాలన్నారు. ఓటుహక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్ మాట్లాడుతూ ఏప్రిల్ 26న జరిగే పోలింగ్‌లో అందరూ పాల్గొనాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గుడిబండ తహసీల్దారు మనీషా మహేశ్, ఈఓ హేమావతి, ఆర్ఐ ఈశ్వర్, రెవెన్యూశాఖ అధికారులు, పెద్దసంఖ్యలో లంబాడి తాండా మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ..

శిడ్లఘట్ట, మార్చి 27: శిడ్లఘట్ట తాలూకా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై బుధవారం ప్రత్యేక జాగృతి నిర్వహించారు. తాలూకాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనుంచి ఆశా కార్యకర్తలు విచ్చేసి రంగవల్లులు వేశారు. తాలూకా స్వీప్ సమితి అధ్యక్షుడు మునిరాజు, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి, ప్రభుత్వ ఆసుపత్రి పాలనా వైద్యాధికారి డాక్టర్ మనోహర్, ఆయుష్ వైద్యులు డాక్టర్ విజయకుమార్, తాలూకా ఆరోగ్య అధికారి దేవరాజ్, మునిర్నతమ్మ, గీతా, చైత్ర, నరసింహప్ప, అఫ్రోజ్, నబివుల్లా, సునిల్‌కుమార్, నరసింహమూర్తి, కీర్తి మంజునాథ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చింతామణిలో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



చేళూరు తాలూకాలో ఓటుహక్కుపై అవగాహనలో అధికారులు



నృత్యం చేస్తున్న లంబాడీ మహిళలు

రాష్ట్రంలో 45వేల మంది మాజీ రౌడీషీటర్ల బైండోవర్

బెంగళూరు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఏకంగా 45వేల మంది మాజీ రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. రాష్ట్ర డీజీపీ అలోక్‌మోహన్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ, మాజీ రౌడీషీటర్లను ఆయా నియోజకవర్గాల పోలీస్ స్టేషన్లకు పిలిపించి గట్టిగా హెచ్చరిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో హింసాత్మక ఘటనలకు తావు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పూర్తిగా సహకరిస్తామని మాజీ రౌడీషీటర్లతో ప్రమాణాలు చేయించామని తెలిపారు. అయినప్పటికీ వారిపై పోలీసుల నిఘా యథావిధిగా కొనసాగుతుందని అన్నారు. ఈసారి సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తున్నామని వివరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో కార్యకర్తల పూజలు



ఆలయం వద్ద అభిమానులు

చేళూరు, మార్చి 27: చిక్కబళ్ళాపుర నుంచి బీజేపీ ఎంపీ టికెట్ డాక్టర్ కే సుధాకర్‌కు లభించడంపై తాలూకా బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన విజయం సాధించాలని కోరుతూ స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిపించి 101 టెంకాయలు కొట్టారు. సుధాకర్‌కు తాలూకా ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వీ శివారెడ్డి, చంద్ర, శేఖర్‌రెడ్డి, శంకరప్ప, సీవీ వెంకటరమణఅప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు సెంట్రల్ బీజేపీ పదాధికారుల కీలక సమావేశం



పదాదికారుల సమావేశంలో ప్రసంగిస్తున్న పీసీ మోహన్

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గం బీజేపీ పదాధికారుల కీలక సమావేశం నగరంలో బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీ అభ్యర్థి పీసీ మోహన్ అధ్యక్షత వహించారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం గతపదేళ్లలో సాధించిన అద్భుత విజయాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రతిబూత్‌లోనూ పార్టీకి అత్యధిక ఓట్లు లభించేలా చూడాలన్నారు. నియోజకవర్గం ప్రజలకు సదాఅండగా ఉన్నానని ఈ సారి కూడా తనను తప్పకుండా ఆశీర్వదిస్తారన్న నమ్మకం ఉందన్నారు. ఈ సమావేశంలో గెలుపు వ్యూహాలపై సమాలోచనలు జరిపారు. పదాదికారుల అభిప్రాయాలను ఆయన ఆలకించారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తా



అనిల్‌రెడ్డి

బొమ్మనహళ్ళి, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ కార్యదర్శిగా ఇటీవల నియమితులైన అనిల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బొమ్మనహళ్ళి నియోజకవర్గంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ప్రచార సమితి కార్యదర్శిగాను, సోషల్‌మీడియా ఇన్‌చార్జ్‌గాను, అధికార ప్రతినిధిగాను వ్యవహరించిన తనకు పార్టీ విశ్వాసంతో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా మరింత బాధ్యత అప్పగించిందన్నారు. నిష్టావంత కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు దక్షిణ అభ్యర్థి సౌమ్యరెడ్డి విజయం ఖాయమన్న ధీమా వ్యక్తం చేశారు. తనకు అవకాశం కల్పించిన సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, మంత్రి రామలింగా రెడ్డి, హెచ్‌ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, బంటి షేక్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అభ్యర్థులు ఎవరైనా యువజన కాంగ్రెస్ తరఫున ప్రచారం చేసి పార్టీ విజయానికి పాటుపడతానన్నారు.

ఆగేదెప్పుడు ?

- పెన్నా, చిత్రావతి నుంచి ఇసుక అక్రమ రవాణా
- మూన్నాళ్ల ముచ్చటగా పోలీసుల దాడులు
- టిప్పర్ల ధాటికి ఛిద్రమవుతున్న రహదారులు

తాడిపత్రిటౌన్, మార్చి 27: ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడులు మూన్నాళ్ల ముచ్చటగా మిగిలాయి. కొంతమంది అధికారుల అండతో ఇసుకాసురులు చెలరేగిపోతున్నారు. పెన్నానది ప్రాంతంలో హిటాచీలతో ఇసుకను తోడేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆపార్టీ నాయకులకు ప్రధాన ఆదాయ వనరుగా ఇసుక మారింది. తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు ప్రాంతాల్లో పెన్నా నది, శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరులో చిత్రావతి నది ప్రవహిస్తున్నాయి. ఈ నదుల్లో ఇసుక నాణ్యతగా ఉండటంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో ఇసుకాసురులు రాత్రిపగలు తేడా లేకుండా ఇసుకను హిటాచీలతో తోడి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. నదులలో ఇసుక తరిగిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతు న్నాయి.

అడ్డదిడ్డంగా ఇసుక అక్రమ రవాణా

అధికారుల నిఘా కొరవడటంతో నియోజకవర్గంలో వైసీపీ నాయకులు రెచ్చిపోయి అడ్డదిడ్డంగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. తాడిపత్రి మండలంలోని గంగాదేవిపల్లి, చిన్నపొలమడ, వీ రాఫురం, సజ్జలదిన్నె, అక్కన్నపల్లి, ఆలూరు గ్రామాల వద్ద పెద్దఎత్తున టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరుగుతున్నా అటువైపు ఏ అధికారి కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్దపప్పూరు సమీపంలో పెన్నానది నుంచి పెద్దఎత్తున ఇసుక తరలింపు జరుగుతోంది. దీంతో నదిలో భారీగా గోతులు ఏర్పడ్డాయి. పెద్దవడుగూరు మండలంలోని చిట్టూరు, చిత్రచేడు, కొండూరు, నాగలాపురం నదీపరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమంగా తరలుతున్నా కట్టడి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. పెద్దవడుగూరు నుంచి నంద్యాలజిల్లాకు ఇసుకను తరలించాలంటే యాడికి మండలంలోని రాయలచెరువు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కానీ యాడికి పోలీసులు దాడులు నిర్వహించి టిప్పర్లు, ట్రాక్టర్లను సీజ్ చేసిన సంఘటనలు చాలా తక్కువగా ఉన్నాయి. పెద్దపప్పూరుతోపాటు గార్లదిన్నె, పసలూరు, నరసాపురం గ్రామాల్లోని నదీపరివాహక ప్రాంతాలను ఇసుకా సురులు టార్గెట్‌గా పెట్టుకొని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా పెద్దఎత్తున అక్రమ రవాణా చేస్తున్నారు. శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు మండలంలోని మేడికుర్తి, తిరుమలాపురం చిత్రావతి నది నుంచి పెద్దఎత్తున ఇసుక తవ్వేస్తున్నారు.



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

పత్తాలేని మైన్స్ అండ్ జియాలజీ అధికారులు

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన మైన్స్ అండ్ జియాలజీ అధికారులు పత్తా లేకుండా పోయారు. ఇసుక తవ్వకాలు చేయకూడదంటూ కోర్టు ఆదేశాలు ఇచ్చినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక పోలీసులైతే తమకు ఎన్నికల విధులు ఉన్నాయంటూ నామమాత్రపు దాడులతో చేతులు దులుపుకుంటున్నారు. ఇరుశాఖల అధికారుల దాడులు లేకపోవడంతో ఇసుకాసురులు యథేచ్ఛగా ఇసుకను తరలించేస్తున్నారు.

అడ్డుకుంటున్న ప్రజలు

ఇసుక అక్రమ రవాణాను అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పలు గ్రామాల్లో ప్రజలే అడ్డుకుంటున్నారు. తాడిపత్రి మండలంలోని ఆలూరు వద్ద ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని టీడీపీకి చెందిన ఓ కీలకనేత, గ్రామస్థులు చెప్పడంతో కొన్నిరోజులు తాత్కాలికంగా అక్కడ తవ్వకాలు నిలిపివేశారు. అయితే రాత్రి సమయాల్లో పెద్దఎత్తున ఇసుకను తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇసుక టిప్పర్ల అధిక టన్నేజీ వల్ల పలు గ్రామాల్లో రోడ్లు ఛిద్రం అవుతుండటంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయంటూ గతంలో గ్రామస్థులు వాహనాలను అడ్డుకున్నారు.

కుమారస్వామి కోసం విశేషపూజలు

బాగేపల్లి, మార్చి 27: మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి ఆరోగ్యం కోసం పార్టీ యువబ్రిగేడ్ రాష్ట్ర సంఘటనా కార్యదర్శి ఎంఎన్ రాజారెడ్డి నేతృత్వంలో విశేషపూజలు నిర్వహించారు. బురుడగుంటె గ్రామ పంచాయతీ పరిధిలోని చారిత్రాత్మక తిరుమలపుర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు జరిపించారు. మాజీ సీఎం కుమారస్వామికి ఇటీవల హృద్రోగ సమస్యలకు సంబంధించి ఇటీవల చెన్నైలో శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఇంట్లో విశ్రాంతి పొందుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన త్వరగా కోలుకుని పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరుతూ పూజలు జరిపించినట్టు అభిమానులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖులు వెంకటరామరెడ్డి, రామాంజి, రమేశ్, సుదర్శన్, ఆలయ సీనియర్ అర్చకులు విజయ్‌కుమార్ భట్టర్ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త వలలో పంచాయతీ కార్యదర్శి

- రూ.2వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



కార్యదర్శి గోవిందప్ప

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గుల్లహళ్ళి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం రూ.2వేల లంచం తీసుకుంటూ కార్యదర్శి గోవిందప్ప పట్టుబడ్డాడు. ఇ-ఖాతా చేసేందుకు రూ.5వేలు డిమాండ్ చేశాడు. ఇందులో భాగంగా రూ.2వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినాడు. గుల్లహళ్ళి గ్రామానికి చెందిన మునియప్ప నుంచి నగదు తీసుకుంటూ దొరికిపోయాడు. కోలారు లోకాయుక్త ఎస్పీ ఉమేశ్ నేతృత్వంలో దాడులు సాగాయి. గోవిందప్పను అదుపులోకి తీసుకుని తదుపరి దర్యాప్తు చేపట్టారు.

చోరీకి యత్నం.. దుండగులు పరారీ

బంగారపేట, మార్చి 27: పట్టణంలోని సంతగేట్ వద్ద ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటితాళాలు పగులగొట్టి చోరీకి ప్రయత్నించారు. బంగారం వ్యాపారి ఇంటి యజమాని శ్రీధర్ ఇంట్లో బుధవారం ఉదయం సుమారు 10.45 గంటలకు దుండగులు చోరీకి ప్రయత్నించారు. ముందుగేట్ నుంచి వెళ్లి బీగాలు పగులగొట్టినా ఫలితం లేకపోవడంతో ఇంటి వెనుకనుంచి వచ్చే ప్రయత్నం చేశారు. సమీపంలోని ఇంటి నిర్మాణ పనుల్లో ఉన్న కార్మికులు వీరి తీరును గమనించి కేకలు వేశారు. దీంతో దుండగులు అక్కడనుంచి పరారయ్యారు. ఇందుకు సంబంధించి ముసుగు ధరించిన దుండగులు ఫోటోలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని డీఎస్పీ పాండురంగ మీడియాకు తెలిపారు. నేరాల నియంత్రణకు నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు.

నేడు శివబాలయోగి మహరాజ్ మహాసమాధి ఆరాధనా మహోత్సవం

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జేపీ నగర్‌లోని శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో 30వ మహా సమాధి ఆరాధనా మహోత్సవం ఈ నెల 28న జరుగనుంది. ఈ మేరకు ఆశ్రమం ట్రస్టు కార్యాధ్యక్షుడు డి.రాంబాబు నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆశ్రమం ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పూజలు, హోమాలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి అనంతరం కుంభాభిషేకం, తదుపరి ప్రసాద వినిమయం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి గంట పాటు ధ్యానం, సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు భజనలు ఉంటాయని ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

బియాండ్ బ్లూప్రింట్స్‌ను ఆవిష్కరించిన డ్యూరో ప్లే

బెంగళూరు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భారతదేశపు అగ్రగామి ప్లైవుడ్స్ సంస్థ డ్యూరో ప్లే తన ఇంటరీయర్ డిజైన్స్, ఆర్కిటెక్ట్‌ల అభిరుచి మేరకు బియాండ్ బ్లూప్రింట్స్‌ను ఆవిష్కరించింది. సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అఖిలేశ్ చిత్లాంగ మీడియాతో మాట్లాడుతూ ఈ ప్యాడ్‌కాస్ట్ సిరీస్‌తో ప్లైవుడ్ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది కానుందన్నారు. విస్తృత పరిశోధనల అనంతరం దీనికి రూపకల్పన చేశామన్నారు. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా దీర్ఘకాల మన్నికను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు శ్రేష్ఠమైన ఉత్పత్తులను అందించాలన్నదే లక్ష్యమన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్, మార్చి 27: పాలిసెట్‌కు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 4న జరిగే పాలిసెట్ పరీక్షలకు జిల్లాలోని అనంతపురం, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, నార్పల, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తరగతులు నిర్వహిస్తామన్నారు. వివరాలకు 94905 41633, 95029 76961 ఫోన్ నెంబర్లకు గాని, సమీప ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను గాని సంప్రదించాలని సూచించారు.